క్లుప్తంగా

ఆర్థిక సాయం



మాక్లూర్: విద్యుత్ ప్రమాదంలో కుడి చేయి కోల్పోయిన మండలంలోని రాంచంద్రపల్లికి చెందిన అన్వేష్‌కు ఆదివారం ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.10 వేల నగదు అందజేశారు. విరిగిన చేయి చికిత్స కోసం ఆసుపత్రి మొత్తం ఖర్చులు కూడా భరిస్తామని ఫౌండేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులకు తెలిపారు. నిరుపేద కుటుంబం కావటంతో అన్వేష్‌కు ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఉపాధి కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహేష్, సురేష్, శ్రీనివాస్, ఆకాష్, ప్రణీత్‌లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వేల్పూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో ఆదివారం ఆర్మూర్‌కు చెందిన అశ్రిత ఆస్పత్రి వైద్యులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సందర్శించారు. పేదవారికి మెరుగైన వైద్యం అందించేందుకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్యులు గణేష్‌రెడ్డి, మౌనికరెడ్డి, సర్పంచ్ తీగెల రాధా మోహన్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

'వడ్డెర' భవనానికి భూమి పూజ



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌లో వడ్డెర సంఘ, యాదవ సంఘ భవనాల నిర్మాణానికి ఆదివారం జెడ్పీటీసీ తలారి గంగాధర్, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్ రెడ్డిలు భూమి పూజ నిర్వహించారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున నిధులను మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా మంజూరుకు కృషి చేసిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బాబా, బీఆర్ఎస్ నాయకులు గోపాల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా మండల యువమోర్చా అధ్యక్షుడిగా సుధాకర్



రుద్రూర్: మోస్రా మండల బీజేపీ యువమోర్చా కమిటీ సభ్యులను ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు స్వామి గౌడ్, బాన్సువాడ సెగ్మెంట్ కో–కన్వీనర్ భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మోస్రా మండల యువమోర్చా అధ్యక్షుడిగా సుధాకర్, ఉపాధ్యక్షుడిగా వినోద్, ప్రధాన కార్యదర్శిగా సున్నపు భూమేష్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. బీజేపీ మండల కార్యదర్శిగా వినోద్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మోస్రా ఉప సర్పంచ్ సుదర్శన్ గౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కొమిరే సాయిలు, బాన్సువాడ యువమోర్చా కన్వీనర్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రాముడి గుడి నిర్మాణం



డొంకేశ్వర్(ఆర్మూర్): రాముడి గుడి కోసం ఊరికి ఊరే సంకల్పించింది. అనుకున్నదే తడవుగా కుల,మతాలకు అతీతంగా అందరూ ఏకమై చందాలు వేసుకున్నారు. దాతల సహకారం కూడా లభించడంతో ఆలయాన్ని విజయవంతంగా నిర్మించుకున్నారు కోమట్‌పల్లి గ్రామస్తులు. ఈ నెల 5వ తేదీ నుంచి నిర్వహిస్తున్న హనుమాన్ సమేత సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. అయితే, గ్రామస్తులు తలపెట్టిన రాముడి కార్యం సంపూర్ణం కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికీ చందాలు వేసుకుని, దాతల సహాయంతో సుమారు రూ.50 లక్షల వ్యయంతో రాముడి గుడిని నిర్మించుకోవడం తమ ఊరు చేసుకున్న అదృష్టమని పేర్కొంటున్నారు. చివరి రోజు విగ్రహాలతో పాటు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం జరిపి అన్నదానం చేశారు.

ప్రతి మహిళ బీమా చేసుకోవాలి

కమ్మర్‌పల్లి: స్వయం సహాయక సంఘాల్లో ఉన్న ప్రతి మహిళ తప్పనిసరిగా బ్యాంకులో బీమా చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్ కోరారు. పీఎంజేబీవై, పీఎంఎస్బీవై పథకం ద్వారా రూ.2 లక్షల ప్రమాద బీమా, రూ.2 లక్షల సాధారణ బీమా సదుపాయం ఉందన్నారు. సమీప బ్యాంకుల్లో ఈ నెల 21 నుంచి 31లోపు బీమా చేయించుకోవాలని సూచించారు.

కొన్నది గోరంత..ఆక్రమణ కొండంత



ఆక్రమణకు గురైన వెయ్యి గజాల స్థలాన్ని మొరంతో భర్తీ చేసిన దృశ్యం



పూడ్చివేసిన ఇరిగేషన్ కెనాల్

- 200 గజాలు కొని వెయ్యి గజాలు ఆక్రమించిన ఒడ్డెర కాలనీవాసి
- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన స్థానిక సర్పంచ్ మల్లారెడ్డి
- ఆక్రమణతో కాలనీలోకి వస్తున్న వర్షపు నీరు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి శివారు గుత్ప చౌరస్తా ఒడ్డెర కాలనీలో 63వ నంబర్ జాతీయ రహదారి ప్రక్కన అదే కాలనీకి చెందిన ఒకరు 200 గజాలు కొనుగోలు చేసి, ప్రక్కనే ఉన్న మరో వెయ్యి గజాలను ఆక్రమించుకుని మొరంతో భర్తీ చేశాడు. ఇటీవల వర్షం కుర్సినప్పుడు పైనుండే వచ్చే నీరంతా కాలనీలోని ఇళ్లలోనికి చేరుతోంది. దీంతో కాలనీ వాసులు ఈ విషయం గురించి సర్పంచ్ చింత మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఎప్పుడు రాని సమస్య ఇప్పుడెందుకు వచ్చిందనేది ఆరా తీసిన సర్పంచ్‌కు అసలు విషయం బయట పడింది. ఇదే కాలనీకి చెందిన ఒకరు తనకు ఉన్న 200 గజాల భూమికి పక్కనే ఉన్న ఇరిగేషన్ కాల్వను పూడ్చివేసి 1000 గజాలు అసైన్డ్ భూమిని ఆక్రమించడం వల్ల వర్షపు నీరు వస్తోందని అర్థమైంది. ఈ విషయమై ఆక్రమణదారుడికి పలు సార్లు చెప్పినా విన్పించుకోకపోవటంతో తహసీల్దార్ శంకర్‌కు సర్పంచ్ ఫిర్యాదు చేశారు.

ఆ భూమి భవిష్యత్తులో గ్రామ ఉమ్మడి అవసరాలకు ఉపయోగపడుతుందని, గ్రామ పంచాయతీకి అప్పగించాలని తహసీల్దార్‌ను కోరారు.

మొరంతో భర్తీ చేయడం వల్లే

కబ్జాకు గురైన వెయ్యి గజాల ప్రభుత్వ అసైన్డ్ భూమిలో ఆక్రమణదారుడు మొరంతో భర్తీ చేయడం వల్లే వర్షం కుర్సినప్పుడు పై నుంచి వచ్చే నీటితో పాటు ఇరిగేషన్ కాల్వ ద్వారా వచ్చే నీరంతా ఇళ్లలోకి వస్తోంది. దీంతో ఇళ్లలో ఉండలేని పనిస్థితి ఏర్పడుతోంది. వచ్చేది వర్షాకాలం.. సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నాం.

– జానీ, ఒడ్డెర కాలనీ, అడవి మామిడిపల్లి

చర్యలు తీసుకుంటాం

అసైన్డ్ భూమిలో అదే గ్రామానికి చెందిన ఒకరు వెయ్యి గజాలు ఆక్రమించుకున్న విషయమై ఫిర్యాదు అందింది. ఇప్పటికే ఒకసారి రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ షఫీని విచారణకు పంపాను. ఆక్రమణదారుడు అందుబాటులో లేకపోవటంతో వెనుదిరిగి వచ్చాడు. మరోసారి విచారణకు వెళ్తాం. అప్పటికీ రాకపోతే నోటీసులు జారీ చేసి విచారిస్తాం. ప్రభుత్వ భూమి అని తేలితే స్వాధీనం చేసుకుని జీపీకి అప్పగిస్తాం.

–శంకర్, తహసీల్దార్, మాక్లూర్

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- పీయూసీ చైర్మన్ ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఆర్మూర్: అకాల వర్షాలతో తడిసిపోయిన వరి ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. ఆర్మూర్ మండలంలోని ఆలూర్ బైపాస్ రోడ్డుపై ఆరబోయగా వర్షాలకు నానిపోయిన ధాన్యాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. అకాల వర్షాలతో నేలకొరిగిన పంటలను క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వం కాబట్టి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆర్మూర్ ఎంపీపీ పస్క నర్సయ్య, బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.

పుస్తక పఠనం మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది

ఆర్మూర్: పుస్తక పఠనం మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్‌లోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఉన్న గ్రంథాలయ భవనం మొదటి అంతస్తు నిర్మాణం పనులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్‌తో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రూ.42.50 లక్షలతో నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పుస్తక పఠనాన్ని ప్రతీ ఒక్కరు అలవర్చుకోవాలని అందుకు గ్రంథాలయాలు ఉపయోగపడతాయన్నారు.

పౌల్ట్రీ ఫాం ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం రాంపూర్‌లో ఆదివారం పౌల్ట్రీ ఫాంను ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ప్రారంభించారు. గ్రామానికి చెందిన దయానంద్‌కు ఇటీవల దళితబంధు పథకంలో రూ.10 లక్షలు మంజూరు అయ్యాయి. పథకం ద్వారా వచ్చిన డబ్బులతో దయానంద్ గ్రామంలో పౌల్ట్రీ ఫాంను ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో ఎమ్మెల్యే పౌల్ట్రీ ఫారంను ప్రారంభించారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రైస్‌మిల్లర్ల వైఖరికి నిరసనగా రాస్తారోకో



ఆందోళన చేస్తున్న ఏఐకేఎంఎస్ నేతలు

మాక్లూర్: కొనుగోలు కేంద్రం నుంచి తడిసిన ధాన్యంతో వెళ్లిన లారీలను రైస్‌మిల్లర్లు దింపకుండా పక్కన పెట్టించటాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం ఏఐకేఎంఎస్ నాయకులు ఒడ్డెట్‌పల్లి గ్రామంలో రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుడ్డు గంగాధర్ మాట్లాడుతూ.. మంత్రులు, ఎమ్మెల్యేలు ఒక వైపు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాం.. అధైర్యపడవద్దు అంటూ రైతులకు చెబుతున్నా రైస్‌మిల్లర్లు మాత్రం తడిసిన ధాన్యంతో వెళ్లిన లారీలను దింపకుండా అక్కడే నిలిపి వేస్తున్నారన్నారు. ఫలితంగా లారీల కొరతతో పాటు కాంటాలు నిలిచిపోయి ధాన్యం రాసులు కల్లాల్లో పేరుకుపోతున్నాయన్నారు. ఒక వైపు వర్షం ముంచుకొస్తుంటే మరో వైపు రైస్‌మిల్లర్లు తడిసిన ధాన్యం వద్దంటూ చెప్పటం సరైంది కాదన్నారు. ఈ విషయంపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె చేస్తాం



వంటావార్పుతో నిరసన వ్యక్తం చేస్తున్న జేపీఎస్‌లు

ఆర్మూర్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొన్ని రోజులుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. సమ్మెలో భాగంగా ఆదివారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వంట చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్‌లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని జేపీఎస్‌లు పేర్కొన్నారు. స్పౌజ్ బదిలీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ పరిధిలోని జేపీఎస్‌లు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామ రాజుకు ఘన నివాళులు

స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామ రాజు వర్ధంతిని ఆదివారం రెంజల్ మండలం బోర్గాంలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో, మాక్లూర్ మండలం ఒడ్డెట్‌పల్లిలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అల్లూరి సీతారామ రాజు స్ఫూర్తితో నేటి యువత దేశభక్తితో ముందుకు సాగాలని వక్తలు, నాయకులు పిలుపునిచ్చారు. – రెంజల్/మాక్లూర్/నందిపేట



నందిపేట: నివాళులర్పిస్తున్న ప్రజాపంథా నేతలు



బోర్గాంలో పూల మాలలు వేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు



ఒడ్డెట్‌పల్లిలో.. ఏఐకేఎంఎస్ నేతలు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 14 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం, తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సరిత ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అతిథులు భారత రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ కృషిని కొనియాడారు. ఎంపీపీ పస్క నర్సయ్య, జెడ్పీటీసీ సంతోష్, ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, కౌన్సిలర్లు సంగీత రవి గౌడ్, ఆకుల రాము, కాశీరాం, మాజీ ఎంపీటీసీ రాజ గంగారాం, ఎండీ సలీం పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం గుర్తించాలి



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. ప్రత్యేక జిల్లా కోసం పట్టణ కేంద్రంలోని కోర్టు ఎదుట ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి దీక్షలు చేపట్టారు. ఆదివారం నాటికి న్యాయవాదుల దీక్షలు 140వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు ఎం. గంగారెడ్డి, శంకర్‌లు కూర్చున్నారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను గౌరవించి ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీనియర్ న్యాయవాది సీహెచ్‌వీ హన్మంత్‌రావు దీక్షలను ప్రారంభించారు.

వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

రుద్రూర్: ఈ ఏడాది పదవ తరగతి అభ్యసించే విద్యార్థుల కోసం మాస్టర్స్ ట్యూషన్ సెంటర్ ఆధ్వర్యంలో వివిధ సబ్జెక్టులపై బోధన్ పట్టణంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మాస్టర్స్ ట్యూషన్ సెంటర్, ఓవర్సీస్ ఎడ్యుకేషన్ బోధన్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్ గోపి కృష్ణ తెలిపారు. రుద్రూర్ మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రుద్రూర్ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, మేడంపూడి దత్తు వర ప్రసాద్ సహకారంతో 30 రోజుల శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. బోధన్ బస్టాండ్ ఎదురుగా ఉన్న అప్నా కిరాణా స్టోర్ బిల్డింగ్‌పైన హాలులో ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఈ నెల 5 నుంచి ప్రారంభమైందన్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులుంటాయని వివరించారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

మాక్లూర్: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు చేస్తున్న సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమ్మెలో మాక్లూర్ పరిధిలోని అన్ని గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.

ముప్కాల్ మండల కేంద్రంలో..

బాల్కొండ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మె బాల్కొండలో ఆదివారానికి 14వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు.

వర్ని మండల కేంద్రంలో..

వర్ని: మండల కేంద్రంలో వర్ని, చందూర్ మండలాల ఐకేపీ వీవోఏలు చేస్తున్న సమ్మె 14వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు షమీమ్ మాట్లాడుతూ.. అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు ఇస్తూ గ్రామ సంఘాల లాభాల నుంచి 30% వేతనాల కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కార్యదర్శి అశ్విని, ఉపాధ్యక్షులు మహేశ్, కోశాధికారి శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.



మాక్లూర్‌లో సమ్మె చేస్తున్న వీవోఏలు



సమ్మెలో పాల్గొన్న ముప్కాల్, మెండోరా మండలాల వీవోఏలు



వర్ని మండల కేంద్రంలో..

ఆధ్యాత్మికం..

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



బోధన్/బోధన్‌టౌన్: పట్టణ కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు శనివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి.ఈ నెల 11 వరకు వేడుకలు కొనసాగనున్నాయి. ఆదివారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం స్వామి వారికి తులసి మాలలతో అలంకరణ చేయనున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను మించిన దైవం లేదు



బాల్కొండ: తల్లిదండ్రులను మించిన దైవం లేదని శ్రీహరి తీర్థస్వామీ అన్నారు. బాల్కొండ మండలం సచ్చిదానంద గీతాశ్రమంలో పిల్లల వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులను పూజించాలన్నారు. దైవం ఎక్కడో లేదన్నారు. తల్లిదండ్రుల సేవాలోనే దైవ భక్తి ఉందన్నారు. అనంతరం స్వామికి పాదాభిషేకం నిర్వహించారు. పిల్లలు తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ ఉంటుందని సభ్యులు తెలిపారు.

రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

మోర్తాడ్/బాల్కొండ: మండలంలోని వివిధ గ్రామాలలో అభివృద్ధి పనులకు రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు. జాతీయ రహదారి 63 నుంచి 44 వరకు లింకురోడ్డు పునరుద్ధరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ఆదివారం పనులు ప్రారంభించారు. రూ.4.47 కోట్లతో బీటీ పునరుద్ధరణ, దొన్కల్ నుంచి వడ్డెర కాలనీ మీదుగా పోచంపల్లి వరకు రూ.90 లక్షలతో రోడ్డుకు మరమ్మతు పనులు, శెట్‌పల్లి నుంచి వన్నెల్ బీ వరకు రోడ్డు మరమ్మతులకు రూ.3.95 కోట్లు మంజూరు చేయగా పనులను ఆయన ప్రారంభించారు. తెలంగాణ సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ దొన్కల్ సంజీవరెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ తొగటి శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు బద్దం రవి, సర్పంచ్‌లు కత్తి లావణ్య, రాజేశ్వర్, బద్దం గంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ద్యావతి అశోక్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రశాంత్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



వేల్పూర్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

వేల్పూర్: వేల్పూర్‌లో ఆదివారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన బేల్దారి, యాదవ సంఘాల సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరితో పాటు పాలెం గ్రామానికి చెందిన బీజేపీ యువజన సభ్యులు చేరారు. వీరికి మంత్రి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ జనరంజక పరిపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు.

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో..

పెర్కిట్(ఆర్మూర్): సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమపథకాల పట్ల ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. అంకాపూర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన విశ్వబ్రాహ్మణ కులస్తులు, గొల్ల కుర్మలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీలు ఖాళీ అయ్యాయన్నారు. చేస్తున్న అభివృద్ధిని చూసి ఆర్మూర్ ప్రజలు తనకు హ్యాట్రిక్ విజయం సాధించి పెడతారని ధీమా వ్యక్తం చేశారు.

ధర్మోరా గ్రామస్తులు..

మాక్లూర్: మండలంలోని ధర్మోరాకు చెందిన 15 మంది బీజేపీ కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరినట్టు పార్టీ మండల అధ్యక్షుడు బడుగు సత్యం, యువసేవన అధ్యక్షుడు రంజిత్‌లు తెలిపారు. వీరందరూ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సమక్షంలో ఆర్మూర్ క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లి పార్టీలో చేరారని వెల్లడించారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ



నందిపేట్(ఆర్మూర్): శాపూర్‌లో ఆదివారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం భూమిపూజ చేశారు. గ్రామంలోని రామాలయ ఆశ్రమం వద్ద 21 ఫీట్ల భారీ విగ్రహ నిర్మాణానికి గ్రామస్తులు నిర్ణయించారు. ఈ మేరకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌజన్య, ఉప సర్పంచు ఆనంద్ మహేష్, రామాలయ కమిటీ చైర్మన్ గంగోని వెంకటేష్, గుర్రపు తిరుపతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు చందూర్ మండల సర్వసభ్య సమావేశం

రుద్రూర్: చందూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లావణ్య తెలిపారు. అతిథిగా అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరు కానున్నట్లు వెల్లడించారు. సమావేశం రైతు వేదిక భవనంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని,ప్రజాప్రతినిధులు అధికారులు సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు.